దోమల బెడద తీరేదెన్నడు?

- తాజ్‌బంజారా చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- ప్రేమ్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి ఘోరం


తాజ్‌బంజారా చెరువు లోపల పేరుకుపోయిన గుర్రపుడెక్క

ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే దోమలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను ఇళ్లలో ఉండనివ్వడం లేదు. మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై జీహెచ్‌ఎంసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం చూపడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజ్‌బంజారా హోటల్ ముందున్న అంతిగానికుంట(తాజ్‌బంజారాలేక్)లో విపరీతంగా పేరుకుపోయిన గుర్రపుడెక్కతోపాటు ఈ చెరువులో కలుస్తున్న మురుగు వల్లే ఈ పరిస్థితి నెలకొంది.

లీజు ముగియడంతో సమస్య

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.1లో గతంలో ఒక వెలుగు వెలిగిన తాజ్ బంజారా హోటల్ లీజు గడువు ముగియడంతో స్థల యజమాని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. హోటల్ నడుస్తున్నప్పుడు దాని నిర్వాహకులు ఎదురుగా ఉన్న అంతిగానికుంట(తాజ్ బంజారా) చెరువు నిర్వహణను చూసుకునేవారు. అందులో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించేవారు. తమ వద్దకు వచ్చే సందర్శకులకు ఈ చెరువు ఓ ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేది. రెండు సంవత్సరాలుగా ఈ హోటల్ మూతపడడంతో చెరువు నిర్వహణను పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగింది. సమీప ప్రాంతాలైన గౌరీశంకర్ కాలనీ తదితర బస్తీల నుంచి సివరేజీ వ్యర్థాలతో పాటు నాలా మురుగునీరు ఈ చెరువులో కలుస్తుండడంతో తీవ్ర దుర్గంధం వస్తుంది. దాదాపు రెండు నెలలుగా ఈ చెరువుకు ఎదురుగా ఉండే ప్రేమ్‌నగర్‌లో విపరీతమైన దోమలు పెరిగిపోయి ఉదయం నుంచి రాత్రి వరకు ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం వేళల్లో సైతం దోమల కోసం ఉత్ప్రేరకాలను వాడాల్సిన పరిస్థితి నెలకొంది. దోమల కాయిల్స్, తెరలు, ఎలక్ట్రిక్ బ్యాట్‌లు వాడినా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ్‌నగర్‌తో పాటు ఈ చెరువులోని గుర్రపుడెక్క, దుర్గంధం వల్ల శ్రీరాంనగర్, రోడ్డు నెంబర్.13, సింగాడికుంట, ఉదయ్‌నగర్, గౌరీశంకర్ కాలనీ, రోడ్డు నెంబర్.10 చుట్టుపక్కల ప్రాంతాలవారితో పాటు ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ కాలనీలోని వీఐపీలకు సైతం దోమల బెడద తీవ్రంగా ఉంది. ఈ గుర్రపుడెక్క వల్ల విపరీతమైన దోమలు వస్తున్నాయని జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీతోపాటు ఉన్నతాధికారులకు తెలిసినా, తొలగించడంలో తీవ్ర జాప్యం జరగడం వల్లే రోజురోజుకూ సమస్య మరింత తీవ్రతరమవుతోంది. గతంలో ఈ చెరువు విస్తీర్ణంగా ఉన్నా, చుట్టూ ఆక్రమణలకు గురవడంతో కుచించుకుపోయింది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, ఎంటమాలజీ అధికారులు చొరవ చూపి చెరువులోని గుర్రపుడెక్కను తొలగించి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చెరువులోకి సివరేజీ, మురుగు కలవకుండా చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దోమలతో సతమతం



ఉదయం నుంచి రాత్రి వరకు దోమలతో సతమతమవుతున్నాం. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకసారి పరిస్థితిని ఇక్కడకు వచ్చి చూడాలి. ఇప్పటికే జ్వరాలతో కొందరు బాధపడుతున్నారు. మమ్మల్ని పట్టించుకోండి.

● గట్టు లక్ష్మి, ప్రేమ్‌నగర్

మేయర్ చొరవ చూపాలి



చెరువు నిర్వహణ లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఈ విషయమై మేయర్‌కు, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా, ఫలితం లేదు. మేయర్ వెంటనే ప్రత్యేక చొరవ చూపితే గుర్రపుడెక్కను తొలగించి వ్యర్థాలు చెరువులోకి రాకుండా చేస్తారు. ప్రజలు వ్యాధుల బారిన పడకముందే జాగ్రత్త పడాలి.

● కెహెచ్.భగవాన్‌దాస్, ప్రేమ్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

చెరువును శుభ్రపరచండి



తాజ్‌బంజారా చెరువులో గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలు ఉండడం వల్లే చుట్టుపక్కల ప్రాంతాల్లో దోమల సమస్య తీవ్రంగా ఉంది. రెండు నెలలుగా మేము పడుతున్న బాధ వర్ణనాతీతం. అధికారులు మా పరిస్థితిని తెలుసుకొని పరిష్కరించాలి. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రాబోయే వర్షాకాలంలో మా పరిస్థితిని ఊహించుకోలేకపోతున్నాం.

● కె.అనసూయ, ప్రేమ్‌నగర్

ఉన్నతాధికారులకు నివేదించాం

తాజ్‌బంజారా లేక్‌లో గుర్రపుడెక్క వల్ల దోమలు బాగా ఉన్నాయి. మాకు ప్రేమ్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. మా సిబ్బంది తరచూ ఫాగింగ్, దోమల నివారణకు చెరువులో మందులను వేస్తున్నారు. గుర్రపుడెక్క తొలగింపు, ఇందులో వ్యర్థాలు కలుస్తున్న విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పరిష్కారమవుతుంది.

● రజని, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఏఈ


పాఠశాల భవనం పనులను పరిశీలిస్తున్న ముకుందరెడ్డి

ఎర్రమంజిల్ పాఠశాల భవనం పనులను పూర్తి చేయాలి

పంజాగుట్ట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం పనులను వెంటనే పూర్తి చేయాలని హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ ముకుందరెడ్డి ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి, నిమ్స్ ఎక్స్‌టెన్షన్ పనుల నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి గురువారం పాఠశాల భవనం పనులను పరిశీలించారు. పాఠశాల భవనం పూర్తికానందున నూతన విద్యా సంవత్సరం మొదలుకానుండడంతో నూతన భవన పరిసర ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలని పి.విజయారెడ్డి కోరారు.

మధురానగర్ సీఐగా ప్రభాకర్


ప్రభాకర్

యూసుఫ్‌గూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): 2009 బ్యాచ్‌కి చెందిన ప్రభాకర్ గురువారం మధురానగర్ పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మోండా మార్కెట్ పీఎస్‌లో డీఐగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వచ్చారు.

గంజాయి విక్రయం.. ముగ్గురి అరెస్ట్

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న యువకుడితోపాటు వినియోగిస్తున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులను నార్కోటిక్ డ్రగ్స్, ఫిలింనగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఏపీలోని మంగళగిరికి చెందిన కె.రాహుల్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. కొద్దికాలం క్రితం గంజాయికి అలవాటు పడ్డ రాహుల్ సరఫరాదారుగా డబ్బు సంపాదించాలని భావించాడు. ఈ మేరకు చెన్నైకి చెందిన మహేష్ నుంచి గంజాయిని తీసుకొని నగరానికి వచ్చి పలువురు యువకులకు అమ్ముతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు రాహుల్ ఫిలింనగర్‌లో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి వినియోగిస్తున్న స్వయంభు, కుందన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

యూసుఫ్‌గూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదశాత్తు వృద్ధురాలు కిందపడి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన మెహరున్నీసాబేగం ఈనెల 19న ఇంట్లో వంట చేస్తూ ప్రమాదశాత్తు కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పాతబస్తీ నుంచి తల్లి వద్దకు వచ్చిన కూతురు అఫ్రిన్‌బేగం బయట నుంచి ఇంట్లోకి వెళ్లి తల్లిని చూడగా కిందపడి స్పృహ తప్పిపోయి ఉంది. పొరుగు వాళ్లను పిలిచి అమీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. ప్రాథమిక వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

అసభ్యకర మెస్సేజ్‌లతో యువతికి వేధింపులు

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): అసభ్యకర మెస్సేజ్‌లతో యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన శశికిరణ్ ప్రైవేట్ ఉద్యోగి. అదేసంస్థలో పనిచేస్తున్న యువతి ఫోన్‌కు అసభ్యకర మెస్సేజ్‌లు పెడుతూ వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని సహ ఉద్యోగి ప్రశాంత్‌కు యువతి చెప్పగా అతడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): భర్త కోసం వేచి చూస్తున్న మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని ఖైరతాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సచివాలయం సమీపంలోని లేఖ అపార్ట్‌మెంట్ వద్ద ఓ మహిళ తన భర్త కోసం బుధవారం రాత్రి 10 గంటల సమయంలో వేచి ఉండగా ఓ వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడాడు. బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈవిషయమై మహిళ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు షేక్ అబ్దుల్లా(22)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆటో ఆర్‌సీ వివాదం.. వ్యక్తిపై దాడి

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆటో విషయంలో తలెత్తిన వివాదం వ్యక్తిపై దాడికి దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉండే మహ్మద్ సాజిద్ ఆటోడ్రైవర్. కొన్నిరోజుల క్రితం అస్లాంకు ఆటోను అద్దెకు ఇచ్చాడు. తిరిగి వెనక్కి తీసుకున్నాడు. కానీ, అస్లాం ఆర్ సీ బుక్ ఇవ్వలేదు. ఈనెల 20వ తేదీన అస్లాం మరో ఆటోలో ఉండగా గమనించిన సాజిద్ అతడిని అడ్డుకొని ఆర్‌సీ ఇవ్వాల్సిందిగా కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో అస్లాం కర్రతో సాజిద్‌పై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట మోసం

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): పార్ట్ టైం ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు గృహిణిని మోసం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లో నివసించే సబ్రీన్ అహ్మద్ గృహిణి. ఈనెల 18న ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తుండగా పార్ట్ టైం ఉద్యోగం కింద ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ప్రకటన కనిపించింది. అక్కడ ఉన్న లింక్ ద్వారా ఆమె రిజిస్టర్ అయ్యాక మూడు దఫాలుగా రూ.65వేలు పెట్టుబడి పెట్టింది. ఆ తర్వాత ఖాతా పని చేయలేదు. ఫోన్ చేయగా, ఎవరూ స్పందించకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి ఈనెల 21న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో..

బంజారాహిల్స్ అమృతవ్యాలీలో నివసించే సయ్యద్ నవాజ్ ఈనెల 17న ఇంట్లో ఉండగా, స్నేహితుడి పేరిట ఒక మెసేజ్ వచ్చింది. తాను అవసరాల్లో ఉన్నట్టు రూ.98వేలు పంపించాలని దాని సారాంశం. నిజమే అనుకొని నవాజ్ డబ్బు పంపించాడు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి అడగగా, డబ్బు రాలేదని చెప్పాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న స్థాయీ సంఘం సభ్యులు ఎండీ.బాబాఫసియుద్దీన్, సి.ఎన్.రెడ్డి తదితరులు

● బోరబండ, ఆంధ్రజ్యోతి

'ట్రస్మా నిర్ణయం వెనక్కి తీసుకోవాలి'

బోరబండ, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయబోమని చెప్పిన ట్రస్మా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత విద్యనందించే విషయంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) పునరాలోచించాలని ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి సునీల్ పవార్ కోరారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.


భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ జయంతిని గురువారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనాటి సమాజంలో పేరుకుపోయిన అసమానతలు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ అని, బాలికల విద్య కోసం ఆనాడే పరితపించిన మహనీయుడని పలువురు పేర్కొన్నారు. సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగానూ, రచయితగానూ, పాత్రికేయుడిగానూ పోరాడారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్, అమరేందర్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎం, జీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


తిరంగా యాత్రలో చింతల, స్థానికులు

ఫిలింనగర్‌లో తిరంగా యాత్ర

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం తెలుపుతూ యువత తిరంగా యాత్ర నిర్వహించారు. జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ భారత్‌కు అనుకూలంగానూ, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగానూ నినాదాలు చేస్తూ యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భారతదేశ త్రివిధ దళాల గొప్పతనం ఆపరేషన్ సిందూతో ప్రపంచానికి తెలిసిందన్నారు. భారత్‌పై ఉగ్రమూకల దాడికి దీటైన జవాబు చెప్పడంతో పాటు పాక్‌ను ఏకాకిని చేసిన ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ చతురతను ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందేనన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

అమీర్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన నార్కోటిక్స్ దాడుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 24న వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు రూ.15 వేల ధారవత్ చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని, పూర్తి వివరాల కోసం 8712659632లో సంప్రదించాలని ఆయన సూచించారు.


ఖైరతాబాద్ త్రిశక్తి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కుటుంబసభ్యులు


జీటీఎస్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష డైరెక్టర్ పి.రాధారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి దంపతులు

జై హనుమాన్

- ఆలయాల్లో జయంతి వేడుకలు


శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన హనుమత్ హోమంలో కార్పొరేటర్ దేదీప్యవిజయ్ దంపతులు

పంజాగుట్ట/బేగంపేట/ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానంలో శ్రీ వీరాంజనేయ స్వామి వారికి సర్వాభిషేకం అనంతరం హనుమత్ హోమం జరిగింది. మధ్యాహ్నం మహా అన్నదానం చేశారు. స్థానిక కార్పొరేటర్ దేదీప్యవిజయ్ దంపతులు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష డైరెక్టర్ పి.రాధారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్‌మూర్తి, వేదపండితులు లక్ష్మణస్వామి బృందం, అర్చకులు, పాల్గొన్నారు. మధురానగర్‌కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ తిరునక్షత్ర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మోడల్‌కాలనీలో సుందరకాండ-హనుమత్ సీతా దర్శనం ప్రవచనాలను తుర్లపాటి రవికృష్ణ వినిపించారు. ఖైరతాబాద్ హనుమాన్ వ్యాయామశాల మందిరం, మింట్ కాంపౌండ్ త్రిశక్తి హనుమాన్ ఆలయం, ఎన్టీఆర్‌మార్గంలోని హనుమాన్ ఆలయాల్లో ఘనంగా పూజలు జరిగాయి.


అన్నదానం కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్ యాదవ్ తదితరులు


నందినగర్‌లోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఆలయ ప్రతినిధులు


ప్రత్యేక అలంకారంలో సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలోని ఆంజనేయస్వామి

రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు నిధులు

- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించనున్నట్లు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.25లో రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు ఆయన గురువారం పర్యటించారు. రోడ్లను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ కాలనీలు, బస్తీల్లో సమస్యలపై నివేదికగా రూపొందించి దశలవారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న వెంకటేష్


పీసీబీ నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు

పర్యావరణ విలువల గురించి నొక్కి చెప్పాలి

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతకు పర్యావరణ విలువల గురించి నొక్కి చెప్పాల్సిన అవసరం ఉందని జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు సనత్‌నగర్ కేంద్ర కార్యాలయంలో గురువారం పచ్చదనం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంపైన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో జంటనగరాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వాయు కాలుష్యం, ప్రజారవాణా, ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవులు, ఇతర జంతువులు సముద్రజీవాలపైన ప్రభావంపై విద్యార్థులు నృత్య రూపకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పీసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల వివాహానికి కల్యాణ లక్ష్మి పథకం ఎంతో మేలు కలిగిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకం కింద 44 మందికి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంపై ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఉచితబస్సు, ఉచిత కరెంటు, 500 గ్యాస్ సిలిండర్, మహిళలను కోటీశ్వరులను చేసే పథకాలు ఇలా మహిళా సాధికారిత దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ముఖ్యమంత్రికి, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.


అమ్మవారికి పూజలు చేసిన శ్రీగణేష్

అమ్మవారి కృపా కటాక్షాలు అందరిపైనా ఉండాలి

సికింద్రాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, అందరికీ శుభం చేకూరాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసన సభ్యుడు ఎన్.శ్రీగణేష్ ఆకాంక్షించారు. గురువారం బాలంరాయి షాపర్స్‌లైన్‌లోని శ్రీకాళీ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్, ఇటికె గోపీ, నరేష్ ముదిరాజ్, ఆర్.వివేకానంద, ఉమామహేశ్వర్‌రావు, రమేష్, ప్రదీప్‌కుమార్, నాగేష్, క్రాంతి, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న జంపన

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన కాళీ దుర్గాదేవి ఆలయంలో కొలువుతీరిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే భక్తుల కోరికలు తీరుతాయన్న విశ్వాసం ఉందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.వివేకానంద, కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు రమేష్, రాజేష్‌యాదవ్, జాయంట్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్, నాగేష్, క్రాంతి, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.


సౌజన్య కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న బానుక నర్మద

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

బోయినపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని బోయినపల్లి 1వ వార్డు సౌజన్య కాలనీలో కంటోన్మెంట్ బోర్డ్ నిధులు రూ.23లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమానికి గురువారం కంటోన్మెంట్ బోర్డ్ సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద, అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారుడు, మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డిలు పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌజన్య కాలనీ వాసులు బానుక నర్మదను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.ప్రభుకుమార్ గౌడ్, కాలనీ సభ్యులు ఎస్.ఎల్.ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రాయల్లా కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, శ్రీధర్ రెడ్డి, పవన్, నర్సింహ్మారెడ్డి, బీజేపీ వార్డు అధ్యక్షుడు రాకేష్, బాణాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 22(ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కూతవేటు దూరంలో ఉన్న సీతాఫల్ మండి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి గురువారం మధ్యరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు శుక్రవారం తెల్లవారు ఝామున మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెక్ బౌన్స్ కేసులో కోర్టు తీర్పు

అడ్డగుట్ట, మే 22 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితిలో పరిచయస్తుడికి డబ్బు ఇవ్వగా... తిరిగి డబ్బు చెల్లించడంలో విఫలమైన వ్యక్తిని తీసుకున్న డబ్బుకు రెండింతలు ఇవ్వాలని సికింద్రాబాద్ సివిల్‌కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన ఎస్‌వివి మురళీకృష్ణ కొన్నేళ్ల క్రితం రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్న మునుస్వామి వెంకటస్వామికి అత్యవసర కోసం రూ.12 లక్షలు చేబదులుగా ఇచ్చాడు. అనుకున్న ఒప్పందం ప్రకారం తిరిగి ఇవ్వాల్సిన రూ. 12 లక్షలు మునుస్వామి వెంకటస్వామి ఇవ్వలేకపోయాడు. దాని నిమిత్తం మునుస్వామి సికింద్రాబాద్ మైలార్‌గడ్డ ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన రూ.12లక్షల చెక్కును ఇచ్చాడు. బాధితుడు చెక్కును బ్యాంకులో వేయగా అది బౌన్స్ అయింది. ఈ క్రమంలో బాధితుడు న్యాయవాది సత్యనారాయణ తరపున కోర్టులో దాఖలు చేశాడు. దాదాపు ఐదేళ్ల నాటి కేసు గురువారం సికింద్రాబాద్ సివిల్ కోర్టు బెంచ్‌పైకి వచ్చింది. ఈ క్రమంలో సికింద్రాబాద్ సివిల్‌కోర్టు 10వ ఎంఎం చీఫ్ జడ్జి ఉపేందర్‌రావు ఇరుపక్షాలు వాదనలు విని చెక్‌బౌన్స్ కేసులో మునుస్వామి వెంకటస్వామి తీసుకున్న రూ. 12 లక్షలకు డబుల్ రూ.24లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని, అదేవిధంగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు ఇచ్చారు.

కానిస్టేబుల్‌ను దూషించిన వ్యక్తికి జైలు

తిరుమలగిరి మే 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసును దూషించిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం మచ్చబొల్లారం నివాసి ఈ నెల 20న పింజాల సుదర్శన్(42) ఒకే వాహనంపై ట్రిబుల్ రైడింగ్ చేస్తూ అల్వాల్ చౌరస్తా వద్ద సిగ్నల్ జంప్ చేసి వెళుతున్నాడు. అయితే అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయగా దూషించుకుంటూ వెళ్లిపోయాడు. వెంటనే కానిస్టేబుల్ ముందు జంక్షన్‌లో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కి సమాచారం అందించాడు. అతడు వారిని ఆపి పరీక్షలు చేయగా మద్యం సేవించాడని నిర్ధారణ అయింది. వెంటనే బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచగా మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలుశిక్ష విధించారు.


తాడ్‌బండ్ ఆలయంలో దర్శనానికి లైన్‌లో భక్తులు


తార్నాకలోని గణపతి దేవాలయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు, మాజీ మేయర్ బండ కార్తీకా చంద్రారెడ్డి తదితరులు


అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి భోజనం చేస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

ఘనంగా హనుమాన్ జయంతి

బోయినపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకలకు అంకురార్పణ చేశారు. ఆలయ పూజారులు 14 రకాల ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి సహస్రనాగవల్లి సహిత సహస్రనామార్చన 1085 తమలపాకులతో నిర్వహించారు. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నామ స్మరణలతో ఆలయ ప్రాంగాణం మారు మోగిపోయింది. హనుమాన్ మాలాధారణలో ఉన్న భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బోయినపల్లి పరిధిలోని పలు ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతిరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

- హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం పికెట్ రాంనగర్‌లోని ప్రసన్న ఆంజనేయ స్వామిని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలకడంతో పాటు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అన్ని రకాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.


స్వామివారికి పూజలు చేస్తున్న ఆలయ పూజారులు

తార్నాకలో..

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు బండ శివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం తార్నాకలోని గణపతి దేవాలయ ఆవరణలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకా చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్రి శశీదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు, బండ చంద్రారెడ్డి, ఆనంద్, గౌతమ్‌రావు, భరత్‌గౌడ్, యాదిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట రమణి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం డౌటన్ బజార్‌లో..

గురువారం బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన హనుమాన్ దేవాలయంలో ఈఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు జరిగాయి. స్వామి వారికి అర్చన, అభిషేకం, ఆకుపూజ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

అడ్డగుట్టలో..

తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ దేవాలయంలో గురువారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పూజలు నిర్వహించారు. చంద్రశేఖర్ శర్మ రాసిన శ్రీరామరక్ష సూత్రం పుస్తకాలను ఆలయ చైర్మన్ సీఐకి అందజేశారు. ప్రతి రోజు ఆలయంలో హనుమాన్ పారాయణ పూజ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ తెలిపారు.


తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీకాంత్‌రెడ్డికి సన్మానం చేస్తున్న ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ్ ప్రసాద్



హనుమజ్జయంతి సందర్భంగా కళాసీగూడలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్. కార్యక్రమంలో గంట సుజార్, అష్మద్, శివ, శ్రీకాంత్ చారి, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- (రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి)

స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్!

సికింద్రాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్టు(సిక్‌విలేజ్) గ్రౌండ్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు కేంద్ర రక్షణశాఖ పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. సిక్‌విలేజ్‌లోని కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్‌ను సకల క్రీడా సదుపాయాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతివ్వాలని రక్షణ శాఖ నిర్ణయించినట్టు తెలిసింది. శుక్రవారం జరిగే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశంలో ఈ అంశం చర్చకు రానుంది. కాగా కంటోన్మెంట్‌కు చెందిన ఈ క్రీడా మైదానంలో ఓవైపు దోబీఘాట్ కూడా కొనసాగుతోంది. దోబీఘాట్ కాకుండా 8 ఎకరాల వరకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం కేటాయించవచ్చని వినికిడి. ఈ మైదానాన్ని అత్యుత్తమ క్రీడా మైదానంగా, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దాలని స్థానిక సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ కొద్ది నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు విన్నవించడంతో దానికి వారు సానుకూలత వ్యక్తం చేశారు. రూ.23కోట్ల వ్యయంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. దాంతో అప్పట్లో ఈ మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి సంబురాలు కూడా జరుపుకున్నారు. కాగా ఈ మైదానం రక్షణశాఖ(కంటోన్మెంట్)స్థలం కావడంతో నిర్మాణానికి రక్షణ శాఖ అనుమతి తప్పనిసరి. అందుకే ప్రభుత్వ ప్రతిపాదనలను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం కేంద్ర రక్షణశాఖకు పంపారు. దీనికి వారు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. దాంతో త్వరలోనే స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావచ్చని భావిస్తున్నారు.


మడ్‌ఫోర్టు గ్రౌండ్

విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

'ఆంధ్రజ్యోతి'తో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ డి.సుభాష్‌రావు

- **ఇప్పటికే విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాలు**
- **మాన్‌సూన్ స్పెషల్ టీమ్‌ల కోసం కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ**
- **రూ. 5కోట్లతో రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కసరత్తు**
- **ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద రూ.12 కోట్ల వసూలు**



సికింద్రాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో తలెత్తే విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ డి.సుభాష్‌రావు తెలిపారు. కాలనీలు, బస్తీలు వరద ముంపు బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

- **వర్షాకాల సమస్యలను ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారా?**

వర్షపునీరు నిలిచిపోయి కాలనీలు, బస్తీలు ఇబ్బందులకు గురైతే తక్షణమే రంగంలో దిగేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. 24గంటల పాటు పని చేసే బృందాలు అందుబాటులో ఉన్నాయి.

- **వర్షాకాల విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక సన్నాహాలు చేస్తున్నారా?**

విపత్తులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. దీనిలో భాగంగా టెండర్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. ఈ నెలాఖరులో టెండర్ ప్రక్రియ పూర్తిచేస్తాం. సర్కిల్‌లోని మొత్తం 6 డివిజన్లకు ఒక్కో డివిజన్‌కు ఒక్కొక్కటి చొప్పున 6 మాన్‌సూన్ స్పెషల్ టీమ్‌లు ఉన్నాయి. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తితే నివారించడానికి ఈ బృందాలు యంత్రపరికరాలు, వాహనాల సహాయంతో పని చేస్తాయి.

- **నాలా పూడికతీత పనులను ఎంతవరకు నిర్వహించారు?**

సర్కిల్‌లో 80శాతం వరకు పనులు పూర్తయ్యాయి. మరో 20శాతం కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించాం. 80శాతం పనులు పూర్తి చేయడం వల్ల వర్షాలు కురిస్తే కాలనీలు, బస్తీలు ముంపుకు గురి కాకుండా ఉంటాయని భావిస్తున్నాం.

- **సర్కిల్ పరిధిలో నూతన రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర పనులకు ప్రత్యేక నిధులు కేటాయించారా?**

సికింద్రాబాద్ సర్కిల్‌కు రూ.5 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర పనులు చేపడతాం. అడ్డగుట్ట మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు సహా మిగతా డివిజన్లలో కమ్యూనిటీ హాల్స్, రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- **ఆర్థిక సంవత్సరం ముగిసింది కదా.. ఇంకా ఆస్తిపన్ను వసూలు కోసం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. మీ సమాధానం?**

అవును. నగరాభివృద్ధిలో, గ్రేటర్ ఖజానా ఆస్తిపన్ను కీలకమైందనే విషయం తెలిసిందే. అందుకే ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద పన్ను వసూలును ముమ్మరం చేయాలని నిర్ణయించాం. మా సర్కిల్‌లో ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద రూ.12 కోట్లు వసూలు చేశాం.

అక్రమ కట్టడాల కూల్చివేత


కూల్చివేత పనులను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు తదితరులు

బౌద్ధనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో పలు అక్రమ కట్టడాలను గురువారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో సీతాఫల్‌మండి ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న మూడు అక్రమ కట్టడాలను, సీతాఫల్ మండి టీఆర్‌టీకాలనీలో ఒకటి, స్థానికంగా ఉన్న మరో కట్టడాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావు, ఏసీపీ శ్రీనివాస రావు అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణలను చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిలకలగూడ పోలీసుల బందోబస్తు మధ్య ఈ కూల్చివేతపనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాక్ ఇంజనీర్ ప్రకాశ్, చైన్‌మన్‌లు చందూ, నాగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సీతాఫల్‌మండిలో అక్రమ కట్టడాన్ని కూల్చివేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

తార్నాక, మే 22 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం లాలాపేట్‌లోని నఫీజ్ ఫంక్షన్ హాల్‌లో సంతోష్‌కుమార్ అధ్యక్షతన మెట్టుగూడ, అడ్డగుట్ట, తార్నాక డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు, మాజీ సర్పంచ్ సిద్దేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి పార్టీ బలోపేతానికై కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బ్రహ్మాజీ, రవి, గంటరాజు, అమర్నాథ్ గౌడ్, కిషోర్ యాదవ్, శిల్పాచారి, గుంటి కృష్ణ, రమేష్, హరి, పర్వేజ్, శేఖర్, శశాంక్, బెన్నా, నిస్సార్, బాబా, అశోక్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా పోరాడాలి

తార్నాక, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పరిపాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమ ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా పోరాడాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.ఎస్.సింహాద్రి అన్నారు. మావోలపై కేంద్రం అనుసరిస్తున్న తీరును ఖండిస్తూ గురువారం తార్నాకలోని పార్టీ కార్యాలయం నుంచి సింహాద్రి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దీర్ఘకాలికంగా కొనసాగుతున్న పోరాటాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా, మావోయిస్టులతో శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కారానికి కృషి చేయకుండా, హింస ద్వారానే పరిష్కరించాలనుకోవడం రాజ్యాంగాన్ని అతిక్రమించడమేనని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.

కరెంట్ తీగలకు అడ్డు.. చెట్టుకొమ్మలు నరికివేత

బౌద్ధనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): కరెంట్ తీగలకు అడ్డురావటంతో పాటు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్న చెట్టు కొమ్మలను గురువారం విద్యుత్ అధికారులు తొలగించారు. సీతాఫల్‌మండి ఏఈ శ్రీకాంత్, ప్యారడైజ్ ఏఈ బాలరాజు ఆధ్వర్యంలో చిలకలగూడ పోలీస్‌స్టేషన్ రోడ్డులో పెరిగిపోయిన చెట్టుకొమ్మలను క్రేన్ సహాయంతో నరికివేసి వాటిని తొలగించారు.

చిలకలగూడ ఏసీపీగా శశాంక్‌రెడ్డి



బౌద్ధనగర్, మే 22(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ పరిధిలో చిలకలగూడ డివిజన్ ఏసీపీ(అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్)గా కె.శశాంక్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1995వ బ్యాచ్‌కు చెందిన శంశాక్‌రెడ్డి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో పని చేసి బదిలీపై చిలకలగూడ డివిజన్ ఏసీపీ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఏసీపీ కార్యాలయంలో లాలాగూడ, చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో సమావేశాన్ని నిర్వహించారు. ఇక్కడ పనిచేసిన ఏసీపీ జైపాల్‌రెడ్డి డీజీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడుతానని, ముఖ్య కూడళ్లలో బందోబస్తును పెంచుతామని, ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.



ఫాగింగ్‌పై అవగాహన

సీతాఫల్‌మండి డివిజన్‌లో నాలా పరివాహక ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందు(ఫాగింగ్)ను సక్రమంగా చేయాలని గురువారం సీతాఫల్‌మండిలో జీహెచ్‌ఎంసీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ.

- (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

కూలిన భారీవృక్షం



బుధవారం కురిసిన వర్షం, గాలి దుమారానికి బొల్లారం జనప్రియ బంగ్లాస్ వద్ద భారీవృక్షం నెలకూలింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గురువారం కంటోన్మెంట్ అధికారులు చెట్టును తొలగించగా, విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి)